# రుణమాఫీపై రైతన్న రణం

కాంగ్రెస్ మాటే శిలాశాసనం అంటూ రుణమాఫీపై సంబురాలు చేసిన ప్రభుత్వాన్ని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. గురువారం ఒక్కరోజే లక్షలోపు రుణాలన్నీ మాఫీఅయ్యాయని అదరగొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకుల ప్రకటనలు నమ్మి బ్యాంకులకు వెళ్లిన అన్నదాతలకు చుక్కెదురు అయింది. రుణమాఫీ జాబితాలో బూతద్దం పెట్టి వెతికినా పేరు కనిపించకపోవడంతో కన్నెర్ర చేశారు. మిత్తితో కలిపి లక్షలోపు రుణం ఉన్నా మాఫీ ఎందుకు కాలేదని ప్రశ్నిస్తే సమాధానం చెప్పే నాథుడే దొరకలేదు. వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు ఒకరిపైఒకరు నెపాన్ని నెట్టే సుకుని రైతులకు ముఖం చాటేశారు. మార్పు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మితే.. మోసపోతిమి కదరా.. రామా.. ! అంటూ రైతులు తలలు పట్టుకున్నారు. రుణ మాఫీ కాకపోతే కర్రు కాల్చుడేనని హెచ్చరించారు.

## రైతులను మోసం చేయొద్దు



నేను మాక్లూర్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో రూ.75వేలు పంట రుణం తీసుకున్నా. కానీ రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. నిబంధనలకు లోబడి ఉన్న అర్హులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలి. రుణమాఫీలో కొర్రీలు పెట్టి రైతులను మోసం చేయొద్దు. - కుమ్మరి గంగాధర్, మాక్లూర్, నిజామాబాద్ జిల్లా

## రుణమాఫీపై సప్పుడులేదు



నాకు ఎకరం 10 గంటల భూమి ఉంది. రెండేండ్ల క్రితం ఏపీ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో 90 వేలు అప్పు తీసుకున్నా. బ్యాంకుకు వచ్చి అడిగితే నీ పేరు రాలేదు.. రుణమాఫీ కాలేదు అంటున్నారు. ఎందుకు కాలేదు అనని అడిగితే సడీసప్పుడు చేస్తలేరు.

-పరమాల ఐలయ్య, పుల్లూరు, సిద్దిపేట జిల్లా

## చెప్పేదొకటి.. చేసేదొకటి



నేను రూ.35 వేల రుణం తీసుకున్న. లెక్క ప్రకారం నాకు వస్తదని అధికారులు చెప్పిన్రు. కానీ నాపేరు లిస్ట్‌లో లేదు. రుణమాఫీ కాలే. కాంగ్రెస్ సర్కారు చెప్పేదొకటి.. చేసేదొకటని అర్థమయితంది. ఇప్పుడే ఇట్లుంటె కాంగ్రెస్ సర్కారు ముమ్ముందు ఎట్లుంటదో సూడాలె. ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష లోపు ఉన్నోళ్లందరికీ వెంటనే రుణమాఫీ చేయాలె.

-కూచనపల్లి రాకేష్, యువరైతు, వీణవంక (19కేఎన్ఆర్08బీ)

## ఎవ్వరూ చెప్తలేరు



నాకు జఫర్‌గఢ్‌లోని ఏపీజీవీబీలో రూ.60 వేలు బాకీ ఉంది. నాతో పాటు చాలామందికి రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులను ఎవ్వరిని అడిగినా సక్కగ చెప్తలేరు. ఇప్పటికైనా రైతుల రుణమాఫీని వెంటనే చేయాలి.

- కొడగాని సుధీర్, సాగరం, జనగామ జిల్లా

## కేసీఆర్ చేసిండు.. కాంగ్రెస్ చేయలేదు



నాకు ఎకరన్నర పొలం ఉన్నది. సాగు కోసం బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాను. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.56 వేలు మాఫీ కాగా.. ఇప్పుడు రూ.28 వేలు రుణం ఉన్నది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తుందని ప్రకటించడంతో డబ్బులు చెల్లించలేదు. తీరా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన లిస్ట్‌లో నా పేరు కనిపించడం లేదు.

-రాజేందర్, కోటకదిర, మహబూబ్‌నగర్

## సగం మాఫీ చేసి సంబురాలా ?



కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ అన్నది. నాకున్న రూ.75 వేల రుణాన్ని మాఫీ చేయలేదు.రూ.56 వేలు మాత్రమే మాఫీ అయ్యిందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. సగం డబ్బులే మాఫీ చేసి.. కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు.

- కృష్ణయ్య, మక్తల్, నారాయణపేట



భువనగిరి యూనియన్ బ్యాంక్ వద్ద అంటించిన రుణమాఫీ జాబితాలో తమ పేరు ఉందో, లేదో చూసుకుంటున్న రైతులు

## సర్కారుకు మంచిది కాదు



నాకు ఎకరం భూమి ఉంది. ఏడాది క్రితం పీఏసీఎస్‌లో 40 వేల రుణం తీసుకున్నా. సహకార సంఘం వద్దకు వస్తే జాబితాలో పేరు లేదు. మాలాంటి ముసలోళ్లను తిప్పడం సర్కారుకు మంచిది కాదు.

-కల్లూరి రామిరెడ్డి, ధర్మారెడ్డిగూడెం, యాదాద్రి భువనగిరి జిల్లా

## మాఫీ చేస్తదో.. చేయదో?



నాకు రెండెకరాల భూమి ఉంది. యూనియన్ బ్యాంకుల క్రాప్ లోన్ రూ.72 వేలు తీసుకున్న. రుణమాఫీ లిస్ట్‌లో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే సరిగ చెప్తలేరు. బ్యాంక్‌కు వస్తే ఇప్పుడు చెప్పమని వెళ్లిపో అన్నరు. కొద్దిసేపటికి రెండో దఫా మాఫీ చేసినప్పుడు అయితవని చెప్పిండ్రు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తదో చేయదో తెలుస్తలేదు.

- పీసం నాగేశ్వరరావు, ఈదులపూసపల్లి, మహబూబాబాద్ జిల్లా

## నాకెందుకు మాఫీ కాదు ?



నాకు ఎకరంన్నర భూమి ఉంది. కోహీర్ బ్యాంకులో 2023 ఆగస్టు 30న రూ.80వేల రుణం తీసుకున్నా. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.80.708 అయింది. మాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను అడిగితే లోన్ తీసుకున్న వివరాల పేపరు తీసి నా చేతిలో పెట్టారు. మా కుటుంబంలో నేను ఒక్కడిని మాత్రమే లోన్ తీసుకున్నా. అయినా ఎందుకు కాలేదో ఎవరూ చెప్పడం లేదు.

-శంకర్, కోహీర్ గ్రామం, సంగారెడ్డి జిల్లా

## జాబితాలో పేరున్నా డబ్బులు రాలేదు



నాకున్న ఎకరం భూమి ఉంది. ఏపీజీవీబీలో రూ.80 వేలు రుణం తీసుకున్నా. బ్యాంకుకు వెళ్లి రుణ మాఫీ గురించి అడిగితే డబ్బులు రాలేదని మేనేజర్ చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులకు వద్దకు వెళ్లి తెలుసుకొమ్మని చెప్పారు. జాబితాలో నా పేరు ఉన్నా.. ఖాతాలో డబ్బులు జమ కాలేదు.

-గనపారపు కృష్ణ, లక్ష్మీపురం, ఖమ్మం

## మాఫీ కొందరికే



నాకు కడ్తాల్‌లో 1.21 ఎకరాల పొలం ఉంది. కెనరా బ్యాంక్‌లో రూ.66 వేల రుణం తీసుకున్నాను. బ్యాంక్‌కి వెళ్లి అధికారులను అడిగితే నీ పేరు లిస్ట్‌లో లేదని చెబుతున్నారు. రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఏ విధంగా చేస్తుందో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికి రుణమాఫీ చేసి, మరికొందరికి చేయకపోవడం అన్యాయం.

- ఎగిరిశెట్టి దశరథం, కడ్తాల్, రంగారెడ్డి జిల్లా

## మోసపోతిమి గదరా..రామా!



ఎన్నికల ముందు కాంగ్రెసోళ్లు ఏకకాలంలో రుణమాఫీ చేత్తమన్నరు. గిప్పుడేమో మూడు విడతల్లో అంటున్నరు. గురువారం ఊరుకో 10 నుంచి 20 మందికే వచ్చింది. గిది న్యాయమేనా రేవంత్‌రెడ్డి సారూ.. ప్రభుత్వం చేసిన జిమ్మిక్కు దాత్తేదాగేదా ఏందీ.. ఏవో సార్ టీవీల ఆధార్ నంబర్ కొడితే రుణమాఫీ చేసిన బాగోతం బయట పడుతూనే ఉండె. రేవంత్ సార్ తప్పకుడా రుణమాఫీ చేత్తడని ఆశ పడ్డం. గిట్లైతదనుకోలే. మార్పు మార్పు అని మోసపోతిమి గదరా.. రామా..

- గుండాల కుమారస్వామి, నల్లబెల్లి, వరంగల్ జిల్లా



## వడ్డీ చెల్లిస్తేనే మాఫీ చేస్తరట..

2021లో రూ.35 వేలు పంట కోసం రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేశామని ప్రకటించడంతో బ్యాంకుకు వచ్చాను. బ్యాంకు అధికారులను అడిగితే ఇంకా రూ.6వేలు వడ్డీ చెల్లించాల్సి ఉందని చెప్పారు. వాటిని చెల్లిస్తేనే రుణం మాఫీ అవుతుందంటున్నారు. అసలు రుణం, వడ్డీతో కలిపి రూ.లక్షలోపు కూడా లేదు. కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణం వడ్డీతో సహా మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు మాఫీ చేసి, వడ్డీ చేయడంలేదు. ఇదేమి న్యాయం ?

-బోయ హన్మంతు, ఉప్పేరు, జోగులాంబ గద్వాల

## కేసీఆర్ మిత్తితోటి మాఫీ చేసిండు..



నాకు ఎల్లారెడ్డిపేట శివారులో వ్యవసాయ భూమి ఉంది. కేసీఆర్ ఉన్నప్పుడు మిత్తితోటి రూ.25 వేలు మాఫీ అయింది. మళ్లీ రూ.25 వేల పంట రుణం తీసుకున్న. కానీ ఇప్పుడు లిస్టులో నాపేరు రాలేదు. రూ.25 వేల అప్పుకు మాఫీ ఎందుకు కాలేదని అడిగెతందుకు బ్యాంకుకు వచ్చిన.

- బుర్క నర్సయ్య, ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా


## 247లో 97మందికే మాఫీ



గీసుగొండ సొసైటీలో నేను రూ. 75 వేలు రుణం తీసుకున్న. గత సంవత్సరం వడ్డీ కట్టిన. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పడంతో ఆనంద పడ్డా. కానీ రుణ మాఫీ లిస్టులో నా పేరు లేదు. దీనిపై ఎవ్వలను అడిగినా కరెక్టుగ చెప్తలేరు. గీసుగొండ సొసైటీ పరిధిలో లక్ష లోపు రుణం ఉన్న రైతులు 247 మంది లిస్టు పంపితే అందులో 97 మంది రైతులకే మాఫీ వచ్చింది. మిగతా రైతులు ఆందోళన చెందుతున్నరు.

- మండ గోపాల్, బొడ్డుచింతలపల్లి, వరంగల్ జిల్లా

## 31వేలే.. మాఫీ కాలే



నాకు బేతంపూడి సొసైటీలో రూ.31వేల క్రాప్ లోన్ ఉంది. ప్రతి సంవత్సరం రుణానికి వడ్డీ కట్టి రెన్యూవల్ చేయించుకుంటున్నా. కానీ రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. రూ.2 లక్షలలోపు పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పేద రైతును నేను. రుణమాఫీ చేయాలని చేతులెత్తి దండంపెట్టి కోరుతున్నా.

- ధరావత్ జయినా, కోక్యతండా, భద్రాద్రి కొత్తగూడెం

## 60 వేలే అప్పు.. అయినా కాలేదు



నాకున్న ఎకరం భూమిపై తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.60వేల క్రాప్‌లోన్ తీసుకున్న. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణమాఫీ అని ప్రకటించింది. సంబురాలు కూడా చేసింది. నేను బ్యాంకు వెళితే లిస్ట్‌లో నా పేరు లేదు. అధికారులు పరిశీలించి బ్యాంకు రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలి.

-ఆర్క నాగోరావ్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్

## రేషన్‌కార్డు లేదంటున్నరు



తాడిచర్ల దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో పట్టాదారు పాస్ పుస్తకం పెట్టి పోయినేడాది రూ.60 వేలు పంట రుణం తీసుకున్న. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రూ. లక్ష వరకు రుణ మాఫీ చేస్తున్నట్టు చెప్పిన్రు. లిస్టులో నా పేరు లేకపోవడంతో బ్యాంక్‌కు వెళ్లి అడిగిన. ఇప్పటి వరకు వడ్డీతో కలిపి రూ.71 వేలు అయినట్లు చెప్పిన్రు. రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాలేదంటున్నరు.

- మల్క భాస్కర్‌రావు, తాడిచర్ల, జయశంకర్ భూపాలపల్లి

## గిట్ల చేస్తరనుకోలే



నాకు ఎకరం భూమి ఉంది. పట్టా పుస్తకంతో సాగుకు రూ. 45 వేల రుణం తీసుకున్న. నాకు పెండ్లి అయ్యింది. పిల్లలు ఉన్నరు. రేషన్ కార్డు మాత్రం లేదు. రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తామని చెప్పిన్రు. నేను వందకు వంద శాతం అర్హున్ని. అయినా నాకు రుణమాఫీ కాలే. రుణమాఫీ చేస్తమని వాగ్దానం చేసి.. ఇప్పుడేమో గిట్ల చేస్తరనుకోలే.

- ఎంబడి తిరుపతి, రైతు, లక్షెట్టిపేట, మంచిర్యాల జిల్లా

## నిరాశే మిగిలింది



నాకు 1.04 గుంటల భూమి ఉంది. 2018 డిసెంబరులో బొంరాస్‌పేట ఎస్‌బీఐలో రూ.48 వేలు పంటరుణం తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ లోనే రుణం తీసుకున్న. మాఫీ అవుతుందని ఎంతో ఎదురు చూశా. కానీ లబ్ధిదారుల జాబితాలో నా పేరు లేకపోవడంతో నిరాశే మిగిలింది. ఎందుకు రుణమాఫీ కాలేదో అర్థం కావడం లేదు.

-రమేశ్‌గౌడ్, తుంకిమెట్ల, వికారాబాద్ జిల్లా

# మమ్మల్ని మాట్లాడనివ్వరా?

- స్టేజీ వద్ద రైతుల ఆందోళన
- రైతులను మాట్లాడకుండా నియంత్రించిన మంత్రులు
- ఉమ్మడి కరీంనగర్‌లో తూతూ మంత్రంగా 'రైతు భరోసా' అభిప్రాయ సేకరణ



కరీంనగర్ శివారులోని వీ కన్వెన్షన్‌లో జరిగిన అభిప్రాయ సేకరణలో రైతులతో మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్

కరీంనగర్, జూలై 19 (నమస్తే తెలంగాణ): 'మీరే మాట్లాడుకుంటారా.. మాకు అవకాశం ఇవ్వరా?' అని రైతు భరోసా అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులపై రైతులు మండిపడ్డారు. కార్యక్రమంలో రసాభాస జరగడంతో ఎవరు.. ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ శుక్రవారం కరీంనగర్ శివారులోని వీ కన్వెన్షన్‌లో జరిగింది. దీనికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 19 మంది రైతులతో అధికారులు మాట్లాడించారు. రైతులకు ఒక్క నిమిషం సమయం మాత్రమే ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన రైతు నారాయణరెడ్డి మాట్లాడుతూ రియల్ భూములకు రైతు భరోసా ఇవ్వరాదని అన్నారు. పంట సాగుకు ముందే రైతు భరోసా ఇచ్చే రైతులకు ప్రయోజనం ఉంటుందని ఆయన మాట్లాడుతుండగానే మరో రైతును పిలిచి సమయం లేదని చెప్పడం గమనార్హం. ఇలా చాలా మంది రైతులను మధ్యలోనే ఆపేసి పంపించడం కనిపించింది. రైతు భరోసాపై జరిగిన అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా జరిగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

### భరోసా అమలు చేస్తాం : మంత్రి తుమ్మల

ఎన్ని అవాంతరాలు ఎదురైనా రైతు భరోసా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రుణమాఫీ పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి హామీని అమలు చేసి తీరుతామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తమది ప్రజాపాలన అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ చెల్లిస్తే రుణమాఫీ వర్తించదని, రేషన్ కార్డు ప్రాతిపదిక రుణమాఫీ జరుగుతుందని కొందరు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఐదెకరాలు ఉన్న వారికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయరమణారావు, ఠాకూర్ మక్కాన్‌సింగ్, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.